క్లుప్తంగా

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా పద్మనాభపురం కాలనీ, పీఎస్ఆర్ కాలనీ, శివసదన్ రోడ్డు, రాజమాత నగర్, నిడమానూరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, స్థానికులు గమనించి సహకరించాలని కోరారు.

పాల రైతులకు బోనస్ పంపిణీ

గన్నవరంరూరల్: పాల రైతుల ప్రయోజనాలే లక్ష్యమని సూరంపల్లి పాలకేంద్రం అధ్యక్షుడు ఈలప్రోలు రాంబాబు అన్నారు. స్థానిక పాల కేంద్రం సభ్యులు 275 మందికి శుక్రవారం రూ.4.79 లక్షల బోనస్‌ను ఆయన పంపిణీ చేశారు. 21మంది పాలరైతులకు ఒక్కొక్కరికీ రూ.5వేలు సబ్సిడీతో బ్రష్ కట్టర్‌ల కొనుగోలుకు నగదును అందజేశారు. తుల్లిమిల్లి కోటేశ్వరరావు అనే పాల రైతుకు మంజూరైన క్షీరబంధు నగదు రూ.50వేలు ఆయన కుటుంబానికి అందజేశారు. కృష్ణామిల్క్ యూనియన్ సూపర్‌వైజర్ బి.నరసింహారావు, డైరెక్టర్‌లు, వేతన కార్యదర్శులు చిట్టినేని జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనం కోసమే సామాజిక తనిఖీ

అంబాపురం(విజయవాడరూరల్): రైతుల ప్రయోజనాలు కాపాడేందుకే ప్రభుత్వం సామాజిక తనిఖీలు నిర్వహిస్తోందని వ్యవసాయశాఖ విజయవాడ అసిస్టెంటు డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు అన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతుల సమక్షంలో సామాజిక తనిఖీ జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు చెందిన వ్యవసాయ భూములను ఈ–క్రాప్ చేసి వాటి వివరాలను సామాజిక తనిఖీల్లో చదవడం వలన ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వుండేందుకు ప్రభుత్వం సోషల్ ఆడిట్ నిర్వహిస్తోందన్నారు. అంబాపురం గ్రామంలో 72 మంది రైతులకు 254 ఎకరాల వ్యవసాయ భూములున్నాయని, వాటి వివరాలను రైతులకు చదివి వినిపించారు. మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు మాట్లాడుతూ మండలంలో 3,192 మంది రైతులకు 13,995 ఎకరాల వ్యవసాయ భూములున్నాయన్నారు. వాటిలో 13,542 ఎకరాలకు ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ బయోమెట్రిక్ జరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం



నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. నున్న విశ్వబ్రాహ్మణ కాలనీలో నిర్మించే విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు శుక్రవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అన్నారు. విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీహాలు నిర్మాణానికి తనవంతు సహాయంగా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.5లక్షలు సొంత నిధులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు ఎంఎల్ నాయుడు మృతి



లబ్బీపేట(విజయవాడ తూర్పు): నగరానికి చెందిన ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఎంఎల్ నాయుడు(70) శుక్రవారం మృతి చెందారు. నగరంలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో దీర్ఘకాలం పాటు పని చేశారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్(సీసీఐఎం) సభ్యులుగా, ఆరోగ్య విశ్వవిద్యాలయం జాతీయ సేవా విభాగం కో ఆర్డినేటర్‌గా పని చేశారు. ఉమ్మడి ఏపీ ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా, నేషనల్ మెడికల్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ ఎంఎల్ నాయుడు ఉద్యోగ విరమణ అనంతరం విజయవాడలోనే స్థిరపడ్డారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మరణంపై ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.బుల్లయ్యతో పాటు పలువురు సంతాపం ప్రకటించారు. బృందావన కాలనీలోని స్వగృహంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అటు ప్రజా సేవ...ఇటు కళాసేవ


ఆయన ఓ గ్రామానికి సర్పంచ్. వృత్తి రీత్యా న్యాయవాది. ప్రవృత్తి రీత్యా కళాకారుడు. మూడు రంగాల్లోనూ రాణించడమే కాదు అవార్డులు, ప్రశంసలు అందుకోవడం విశేషం. ఇటు ప్రజా సేవలోనూ, అటు కళా సేవలోనూ రాణించడమే కాకుండా న్యాయవాదిగా పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తున్నారు. ఆయన పేరు శీలం రంగారావు.

- పలు రంగాల్లో నిడమానూరు సర్పంచ్ రంగారావు ప్రతిభ
- సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తూనే రంగస్థల కళాకారుడిగా గుర్తింపు
- న్యాయవాదిగా ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సుల నిర్వహణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామ సర్పంచ్ శీలం రంగారావు పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. విజయవాడ నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో 2005లో డిగ్రీ పూర్తి చేశారు. కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తాత్కాలికంగా చదువుకు బ్రేక్ వేశారు. 2006లో గ్రామానికి సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం రావడంతో పోటీ చేసి 23 సంవత్సరాల వయస్సులోనే సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్ హోదాలో గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తూ, అందరితో కలివిడిగా మెలుగుతూ మంచి పేరు తెచ్చుకున్నాడు. ఏళ్ల తరబడి పరిష్కారమవని సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఉన్నత చదువుపై ఉన్న మక్కువతో 2012లో న్యాయవాద కోర్సులో చేరి పూర్తి చేశారు. అనంతరం ఎంఎ, ఎంఫిల్ కూడా చేశారు. 2021లో రెండోసారి వైఎస్సార్‌సీపీ మద్దతుతో సర్పంచ్ బరిలో నిలబడి అత్యంత మెజారిటీతో గెలుపొందారు.

నాటక రంగంలో గుర్తింపు

నాటకరంగంపై ఉన్న మక్కువతో కళాశాల స్థాయి నుండే పలు నాటకాలలో నటించి పలువురి మన్ననలు పొందారు. పండుగలకు, ప్రత్యేక సందర్భాల్లో గ్రామాల్లో స్ఫూర్తిని నింపే నాటకాల ప్రదర్శ



ఏకపాత్రాభినయంతో ఆకట్టుకున్న నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు (ఫైల్)

నతో పాటు హాస్యభరితమైన నాటకాల్లో కూడా తనదైన శైలిలో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 2006లో ఆదిలాబాద్‌లో జరిగిన నంది నాటక మహోత్సవాల్లో భాగంగా 'మూక' నాటికలో విశేషమైన నటన ప్రతిభ కనబర్చి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇలా..., నేను సైతం, హెచ్చరిక, సన్ ఆఫ్ ఇండియా, వైష్ణో నారాయణ హరి, వడ్లపు గింజలో బియ్యపు గింజ, కైలాసంలో కోర్టు, ఆ గొర్రెను నేను నాటకాలతో పాటు ఏకపాత్రాభినయాలు కూడా



గతేడాది ఢిల్లీలో 'సుపరిపాలన అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న శీలం రంగారావు

పోషించి అవార్డులు అందుకున్నారు. పేద కళాకారులను చేయూత నిచ్చేందుకు సంఘమిత్ర ఆర్ట్స్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

జాతీయ స్థాయి సదస్సుల్లో ప్రతిభ...

2010లో అఖిల భారత పంచాయతీ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో పంచాయతీల ప్రాధాన్యతపై ప్రసంగం ఇచ్చారు. గతేడాది ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 'సుపరిపాలన అంశం'పై న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో కూడా ప్రసంగించారు. స్మార్ట్ గ్రామ పంచాయతీల సాధికారతపై లక్నోలో జరిగిన జాతీయ సదస్సుకు హాజరయ్యారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే చెప్పాలి

ఆర్డీఓ రాజు

పెనమలూరు: ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఆయా రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టికి తీసుకురావాలని పెనమలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీఓ డి.రాజు అన్నారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా డ్రాఫ్టు నోటిఫికేషన్ విడుదల చేశామని, ఈ మేరకు నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలను ప్రదర్శించామన్నారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే 45 రోజుల్లో తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓటర్ల చేర్పులు, మార్పులు ఉన్నా ఆయా ఫారాల్లో దరఖాస్తు చేయాలని తెలిపారు. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. తుది ఓటర్ల జాబితా జనవరి 5వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గన్నవరం నియోజకవర్గ ఓటర్ల జాబితా

గన్నవరం: గన్నవరం శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి 306 పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బి.చంద్రలీల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటర్ల జాబితాలో సరిచూసుకోవాలని సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో ఓటర్లు 2,65,157 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుష ఓటర్లు 1,28,314, మహిళా ఓటర్లు 1,36,818, ఇతరులు 25 మంది ఉన్నట్లు చెప్పారు. వీరు కాకుండా రక్షణ రంగంలో సర్వీస్ ఓటర్లు 71 మంది, విదేశాల్లో ఉన్న భారతీయ ఓటర్లు 44 మంది ఉన్నట్లు వివరించారు. పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లు 8,504 మంది ఉండడంతో పాటు ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు గాను 1,066 మంది ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుత జనాభా అంచనా ప్రకారం నియోజకవర్గంలో 3,61,061 మంది ఉండగా, ప్రతి వెయ్యి మంది జనాభాకు 734 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. కొత్తగా ఐదు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఓటర్ల వివరాలు

పెనమలూరు నియోజకవర్గంలో	
మొత్తం పోలింగ్ కేంద్రాలు :	304
మొత్తం ఓటర్లు :	2,78,185
పురుషులు :	1,34,671
మహిళలు :	1,43,512
ఇతరులు :	2
తాడిగడప మున్సిపాలిటీలో	
మొత్తం పోలింగ్ కేంద్రాలు :	124
మొత్తం ఓటర్లు :	1,27,312
పురుషులు :	62,366
మహిళలు :	64,945
ఇతరులు :	1
పెనమలూరు మండలంలో	
మొత్తం పోలింగ్ కేంద్రాలు :	42
మొత్తం ఓటర్లు :	36,453
పురుషులు :	17,410
మహిళలు :	19,043
ఇతరులు :	0
కంకిపాడు మండలంలో	
మొత్తం పోలింగ్ కేంద్రాలు :	64
మొత్తం ఓటర్లు :	53,136
పురుషులు :	25,362
మహిళలు :	27,773
ఇతరులు :	1
ఉయ్యూరు మండలంలో	
మొత్తం పోలింగ్ కేంద్రాలు :	74
మొత్తం ఓటర్లు :	61,284
పురుషులు :	29,533
మహిళలు :	31,751
ఇతరులు :	0

ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఈ–క్రాప్ నమోదుపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం ఆరుగొలను రైతు భరోసా కేంద్రం పరిధిలో ఈ–క్రాప్ నమోదుపై శుక్రవారం ఆమె సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆర్బీకేల వారీగా ఈ–క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు నిర్వహించి, రైతుల వివరాలు సరిచూడటం, అభ్యంతరాలను స్వీకరించటం చేపట్టనున్నట్లు వివరించారు. ఈ–క్రాప్‌లో నమోదైన సర్వే నంబర్, పంట, సాగు విస్తీర్ణం వంటి వివరాలను రైతులు కూడా ఈ తనిఖీల్లో సరిచూసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మండలంలో వరి, మినుము, పెసర, వేరుశనగ, పామాయిల్, చెరకు, మామిడి, జామ, నిమ్మ పంటలు సాగులో ఉన్నాయని, మొత్తం 32 వేల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు చేశామని ఏవో భవాని తెలిపారు.

ఆధ్యాత్మిక భావన పెంపునకు కృషి

విజయవాడ కల్చరల్: సమాజంలో ఆధ్యాత్మిక భావన పెంపునకు విజన్ ట్రస్ట్ కృషి చేస్తోందని ఆ సంస్థ సభ్యురాలు బి.హరిప్రియ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 26న తిరుమలలో ప్రారంభమైన శ్రీ వెంకటేశ్వర రథయాత్ర శుక్రవారం నగరంలోని లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకుంది. హరి ప్రియ మాట్లాడుతూ దేశంలోని అన్ని వెంకటేశ్వర స్వామి దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. వందరోజుల పాటు సాగే యాత్రలో రాష్ట్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాలను దర్శించుకుంటూ ఇచ్ఛాపురం చేరుకొని మళ్లీ తిరుమలకు చేరుకుంటుందని తెలిపారు. హరేకృష్ణ గోకుల క్షేత్రం నిర్వాహకుడు వంశీధర్ స్వామి రథ యాత్రకు స్వగతం పలికారు.

నేత్రపర్వంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు

గుంటూరు చెందిన ఐశ్వర్య భక్తిగీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత కళాశాల గాత్ర విభాగం అధ్యాపకురాలు లక్ష్మీ నరసమ్మ బృంద సభ్యులు కాండూరి సుధాకౌముది, నోరి లక్ష్మీ మనోజ, నోరి గాయత్రి అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్ కుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో పలు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. భక్తులు శ్రీ వారి రథం ముందు కోలాటమాడారు.



లబ్బీపేట శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నృత్యం చేస్తున్న కళాకారులు

నేడు కాళీమాత ఆలయం మూసివేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని కాళీమాత ఆలయాన్ని రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు విజయకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం శనివారం రాత్రి 1.05 ప్రారంభమై మోక్షకాలం 2.25 గంటలకు వరకు గ్రహణ కాలం ఉన్నందున దీపారాధన అనంతరం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని మూసివేస్తామని పేర్కొన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరవనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు వీరపనేనిగూడెం విద్యార్థులు



గన్నవరంరూరల్: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు వీరపనేనిగూడెం విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం ఆత్కూరులో జరిగిన ఫెన్సింగ్ జట్ల ఎంపిక పోటీలలో వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆవుల రాకేష్, ఆవుల రోజా, చింతల సిరి ప్రతిభ చాటి విజేతలుగా నిలిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు నవంబరు 1వ తేదీ నుంచి నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపికైన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన పీడీ సీహెచ్ బాలకృష్ణను హెచ్‌ఎం అభినందించారు. క్రీడాకారులు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ పథకాలపై పూర్తి స్థాయి అవగాహన

ఉంగుటూరు: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. ఉంగుటూరులో స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ జనరంజక పాలన అందిస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సమీక్షించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మండల పరిషత్ నిధులు రూ.22 లక్షలు మంజూరు చేసేందుకు ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ వనజాక్షి, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని ఆదిదంపతులకు శనివారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేయనున్నారు. శనివారం ఉదయం 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుంది. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, విద్యాధరపురం, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్ మీదగా మహా మండపానికి చేరుకుంటుంది.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికయిన విద్యార్థులతో కోచ్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ రకాల క్రీడల్లో భాగంగా శుక్రవారం విజయవాడ ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీల్లో జేకే గోజూరై కరాటే అకాడమీకి చెందిన కృష్ణా జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -14 విభాగంలో టి.తేజశ్రీ సాయి (26కేజీ), పాలక్ (38కేజీ), ముఖేష్ రెడ్డి (35కేజీ), ప్రద్యుమ్న (66కేజీ), అండర్-17 విభాగంలో ఎస్ఎస్ రాజ (54కేజీ), నాగ చైతన్య (82కేజీ), సీహెచ్ అక్షిత (56కేజీ), రన్నర్స్ విభాగంలో టి.హర్షిత, కపర్థి ఉన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎస్‌జీఎఫ్ కృష్ణా జిల్లా సెక్రటరీ డి.శ్రీనివాస రావు, ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ సీజర్, కరాటే అకాడమి సీనియర్ కోచ్ జె.హరినాథ్, సత్యనారాయణపురం బ్రాంచ్ కోచ్ హర్ష, వివిధ బ్రాంచిల కోచ్‌లు అభినందించారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు పూర్తి భరోసా



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

దావాజిగూడెం(గన్నవరం): ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ తెలిపారు. మండలంలోని దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు, వృద్ధులకు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రభుత్వం అన్ని రకాల వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రోగులకు ఈసీజీ, రక్త పరీక్షలు, వైద్య పరీక్షలతో పాటు ఖరీదైన మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ శిబిరాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, సర్పంచ్‌లు బడుగు బాలమ్మ, డొక్కు వెంకన్నబాబు, ఉప సర్పంచి వేల్పూరి బసవరావు, ఎంపీడీవో సత్యకుమార్, వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, పంచాయతీ కార్యదర్శి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్య సేవలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



తాడిగడపలో కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: పేదలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప 4వ నంబరు సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధితో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజుల పాటు ఈ పథకం అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి ఇంటికీ సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య శిబిరాలకు తీసుకు వచ్చి వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు ఇస్తున్నామని వివరించారు. ప్రతి పేదవాడు ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనంతరం రోగులకు వైద్య కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రకాశరావు, వైద్యుడు రవికుమార్, వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



తాడిగడపలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: ప్రభుత్వం నవరత్నాలు అమలు చేసి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప 4వ నంబరు సచివాలయం పరిధి శ్రీనివాస నగర్‌లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొని పేదలకు అందించిన సంక్షేమ పథకాలతో ఉన్న బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు జగనన్న అండగా ఉన్న విషయాన్ని డ్వాక్రా మహిళలు గుర్తించాలని, వచ్చే ఎన్నికల్లో డ్వాక్రా మహిళలంతా జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్. ప్రకాశరావు, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రామ్‌బాలసింగ్

గన్నవరం: నవంబరు 3వ తేదీ నుంచి జరగనున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే–2023కు అందరూ సన్నద్ధంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి రామ్‌బాలసింగ్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే–2023పై గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన ఎంఈఓ, ఇన్విజిలేటర్లకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను లెక్కించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మూడు మండలాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్ల విధుల కోసం ఎంపిక చేసిన డిగ్రీ, డైట్, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సమర్థంగా పనిచేయాలని సూచించారు. పలు జెడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు, ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో తెగులు నివారణపై అవగాహన



ఎరువు తయారీపై రైతులకు శిక్షణ ఇస్తున్న ఉద్యాన అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆయిల్‌పామ్ తోటల్లో వ్యాప్తి చెందుతున్న కాండం మొదలు కుళ్లు తెగులు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ తెలిపారు. బాపులపాడు మండలం వేలేరులో ఉద్యాన శాఖ, పతంజలి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ తెగులు సోకటం వల్ల ఆయిల్‌పామ్ మొక్కల్లో కాండం మొదలులో లేత గోధుమరంగు మచ్చలు కనిపిస్తాయని, కాండం లోపలిభాగం కుళ్లిపోయి పీచు లాగా మారుతుందని వివరించారు. కాండం మొదలు కుళ్లు తెగులును నివారించేందుకు తోటలో కుళ్లిన, చనిపోయిన, తెగులు సోకిన ఆయిల్‌పామ్ మొక్కలను తొలగించాలని రైతులకు సూచించారు. తెగులు సోకిన మొక్కకు ఐదు కిలోగ్రాముల వేప పిండి వేయాలని ఉద్యాన అధికారి హరిచంద్ చెప్పారు. ఎకరాకు ఆరు కేజీల ట్రైకోడెర్మా విరిడిని 300 కేజీల పశువుల ఎరువుతో కలిపి చెట్టుకు ఐదు కేజీల చొప్పున వేయటం ద్వారా తెగులు ఉధృతిని తగ్గించవచ్చని వివరించారు.

నేడు గ్రామ సచివాలయ నూతన భవనం ప్రారంభం

ఉంగుటూరు: నందమూరు గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను ఈ నెల 28న ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.21.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మాణం చేశారని చెప్పారు. గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ నూతన భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.